quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487
# క్విక్ టుడే
QUICK TODAY DAILY దినపత్రిక
EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476
మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 316 శనివారం 10 ఆగస్టు 2024 వెల : 3 రూ/.. పేజీలు - 8

## 15న అన్న క్యాంటీన్లు ప్రారంభం




**విజయవాడ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** నిరుపేదలకు తక్కువ ధరకే భోజనాన్ని అందించే అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను లాంచనంగా ప్రారంభించనున్న దృష్ట్యా నగరంలో ప్రారంభించే అన్న క్యాంటీన్ల నిర్వహణ పనులను రేపటికల్ల పూర్తి చేసి సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన ఆహారాన్ని ఐదు రూపాయలకు అందించనున్నారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడుపూటలా అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.15 లకే లభ్యం కానున్నదన్నారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు.



### నచ్చిన దుస్తులు
## ధరించాలి

**కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా, నిఖాబ్ నిషేధం సరికాదు**

**చెంబూరు కళాశాల ఉత్తర్వులపై స్టే విధించిన సుప్రీం కోర్టు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా, నిఖాబ్ ధరించకూడదంటూ చెంబూరు కళాశాల జారీ చేసిన మిగతా 2లో..



### తవ్వకాల్లో కుండనిండా
## బంగారు నాణేలు

**పురాతన గ్రీకు రాజ్యానికి చెందినవిగా అంచనా**

**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** తుర్కియే పశ్చిమ ప్రాంతంలో ఇటీవల పురాతత్వ శాస్త్రవేత్తలు తవ్వకాలు చేపట్టగా.. ఓ కుండ నిండా బంగారు నాణెలు బయటపడ్డాయి. వీటిపై మిగతా 2లో..

# తెలంగాణ..
# ఫ్యూచర్ స్టేట్

**కొత్త ట్యాగ్ లైన్‌తో పిలుద్దామన్న సీఎం రేవంత్‌రెడ్డి**

**ఈ నినాదాన్ని వీలైనంతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి సీఎం ప్రసంగం**

**హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ కొత్త రీసెర్చ్ సెంటర్**

**మూడు వేల మందికి ఉద్యోగాలు**

**అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తో సీఎం భేటీ**





**హైదరాబాద్, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** ఇకపై తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్' అనే ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఫ్యూచర్ స్టేట్‌కు తెలంగాణ పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులను తెలంగాణకు ఆహ్వానించారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చదిద్దుకుందామని సీఎం పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త బ్రాండ్ తీసుకొచ్చారు. ఇకపై తెలంగాణను తెలంగాణ.. ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కొత్త నినాదాన్ని వీలైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇకపై రాష్ట్రానికి ఇదే ట్యాగ్‌లైన్‌గా నిలవనుందన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ముందడుగు వేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసురావడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ఆయన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరూ మిగతా 2లో..



## కాంట్రాక్టర్‌దే బాధ్యత

**సుంకిశాల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**

**సంఘటన చిన్నదే.. నష్టం తక్కువే**

**ఆందోళన వద్దు.. నష్టం భరించేది కాంట్రాక్టరే**

**ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు సరికాదు: గుత్తా**

**నల్లగొండ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్):** బీఆర్ఎస్ హయాంలోనే సుంకిశాల పంప్ హౌజ్ పనులు జరిగాయని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కూలిపోయిన రిటైనింగ్ వాల్‌ను శుక్రవారం మంత్రులు పరిశీలించారు. వ్యవసాయశాఖ మిగతా 2లో..

### సుంకిశాల ప్రాజెక్టుపై
## అసత్య ప్రచారం

**రిటైనింగ్ వాల్ కూలినా.. ఎందుకు దాచి పెట్టారు**

**సుంకిశాలతో నగర నీటి అవసరాలు తీర్చాం**

**నగర నీటికోసం చంద్రబాబు, వైఎస్ కృషి చేశారు**

**సుంకిశాల ఘటనకు సీఎం రేవంత్‌దే బాధ్యత**

**మంచి జరిగితే వారి ఖాతాలో.. లేకపోతే మా ఖాతాలోనా?**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** సుంకిశాల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా మిగతా 2లో..

## ఆగష్టు 15లోపు
## రూ.2 లక్షల రుణమాఫీ

**వైరా సభ ద్వారా రైతులకు రుణవిముక్తి ప్రకటన**

**రైతులతో ఆనాడు భారీ బహిరంగ సభ**

**ఇందిరమ్మ రాజ్యంతో రైతుల్లో ఆనందం**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



ఖమ్మం,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): రెండు లక్షల వరకు ఆగష్టు 15లోపు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు రుణాలు వైరాలో భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. వైరా నుంచి ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేశారని.... కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం వైరా సభలో రైతులు పండుగ లాగా పాల్గొని మన రైతాంగ సోదరులు మంచి సందేశం ఇచ్చేలా సభ జరుపుతామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల మిగతా 2లో..

## జయబచ్చన్ మళ్లీ ఆగ్రహం

**జయా అమితాబ్ బచ్చన్‌గా పిలవడంపై అభ్యంతరం**

**రాజ్యసభ ఛైర్మన్ తీరుకు నిరసనగా వాకౌట్**



న్యూఢిల్లీ,ఆగస్ట్9(ఆర్ఎన్ఎ): రాజ్యసభ ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు జయా బచ్చన్ మరోమారు కోపానికి వచ్చారు. తన పేరును పదేపదే జయా అమితాబ్ బచ్చన్‌గా పిలవడంపై అభ్యంతరం తెలిపారు. మహిళలకు సొంతంగా పేర్లు ఉండవా అంటూ ప్రశ్నించారు. ఆమెకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మద్దతుగా నిలిచారు. మరోసారి జయా బచ్చన్ పేరును జయా అమితాబ్ బచ్చన్‌గా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సంబోధించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై దన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ..నాకు పాఠాలు చెప్పొద్దు అని తీవ్రంగా స్పందించారు. దాంతో ఛైర్మన్ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఛైర్మన్ వైఖరిని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. దీనిపై జయ మీడియాతో మాట్లాడారు. ఛైర్మన్ ఉపయోగించిన స్వరాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. మేం పాఠశాల విద్యార్థులం కాదు. మాలో కొందరు సీనియర్ సిటిజెన్లు కూడా ఉన్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు నిల్చున్న సమయంలో ఆయన మాట తీరు బాధించింది. మైక్ కట్ చేశారు. అలా ఎలా ప్రవర్తిస్తారు? మీరు సెలబ్రిటీ అయితే ఏంటి నేను పట్టించుకోనంటూ తీవ్ర పదజాలం మిగతా 2లో..

### నీట్-పీజీ పరీక్షను
## వాయిదా వేయలేం

**వాయిదా పిటిషన్లను తిరస్కరించిన సుప్రీం**



**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ మిగతా 2లో..

### సుప్రీంలో కవిత
## బెయిల్ పిటిషన్

**సోమవారం విచారణకు వచ్చే అవకాశం**



**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** భారాస ఎమ్మెల్సీ కవిత సుప్రీకోర్టును ఆశ్రయించారు. దిల్లీ మద్యం విధానానికి సంబంధించి ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరిస్తూ జులై 1న దిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జాబితాలో కవిత పిటిషన్ లిస్ట్ అయింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. గత ఐదు నెలలుగా కవిత తిహాడ్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు.. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తిహాడ్ జైలు నుంచి 17 నెలల తర్వాత ఈ సాయంత్రం బయటకు వచ్చారు.

### వక్ఫ్ జేపీసీలో నలుగురు
## తెలుగు ఎంపీలు

**హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌కు చోటు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** వక్ఫ్ సవరణ చట్టం బిల్లుపై 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీని నియమించారు. ఇందులో నలుగురు తెలుగు ఎంపీలకు అవకాశం లభించింది. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ (హైదరాబాద్), భాజపా ఎంపీ డీకే అరుణ (మహబూబ్‌నగర్), తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి(రాజ్యసభ) సభ్యులుగా ఉంటారు. వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపించనున్నట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.



## సిసోడియా..
## బెయిల్‌పై రిలీజ్

**తీహార్ జైలు నుంచి విడుదలైన మనీష్ సిసోడియా**

**ఘనంగా స్వాగతం పలికిన ఆప్ మంత్రి అతిషి**

**న్యూఢిల్లీ, ఆగస్ట్9 :** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీష్ సిసోడియా శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని తిహార్ మిగతా 2లో..

### ప్రజావాణికి
## భారీగా వినతులు

**మొత్తం 502 దరఖాస్తులు అందినట్లు ప్రకటన**



**హైదరాబాద్, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 502 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 112, మైనారిటీ వెల్ఫేర్ కు సంబందించి 71, పౌరసరఫరాలశాఖకు సంబంధించి 69, పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబందించి 42, మున్సిపల్ శాఖకు సంబంధించి 35 ఇతర శాఖలకు సంబంధించి 173 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మొదటి పేజీ తరువాయి..

# తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

త్వరగా గుర్తుంచుకునేలా ట్యాగ్‌లైన్ సూచించారు. ఇకపై తెలంగాణను తెలంగాణ.. దిఫ్యూచర్ స్టేట్ గా పిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నాల్గో నగరంలో నిర్మిస్తున్నామని ఇందులో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో లాంటి ప్రాజెక్ట్‌లతో తెలంగాణ రాష్ట్రం భవిష్యత్ పూర్తిగా మారనుందన్న ఆయన...అందుకే దీన్ని ది ఫ్యూచర్ స్టేట్‌గా నామకరణం చేశామన్నారు. మెట్రోసిటీగా ఎదిగిన హైదరాబాద్‌ను మరింత విస్తరిస్తున్నామని, కొత్తగా మరో మహానగరమే నిర్మిస్తున్నామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడులు పెట్టేందుకు తరలిరావాని కోరారు. అమెరికాలో ఏ నగరానికి ఆనగరం ప్రత్యేకమేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో వివిధ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ప్రతి రాష్ట్రానికి దాని గుర్తింపు తెలియజేసేలా ఓ సరికొత్త ట్యాగ్‌లైన్ ఉండడాన్ని సీఎం రేవంత్ గమనించారు. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ నినాదం కాగా టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారని తెలుసుకున్నారు. అలాగే కాలిఫోర్నియాకు యురేకా అనే ట్యాగ్‌లైన్ ఉండడాన్ని గమనించారు. ఇదంతా ఎందుకు అని అక్కడి వారిని సంప్రదించగా....ఇదే తమ బ్రాండ్ నినాదమని చెప్పారు. ప్రజలకు బాగా గుర్తుండిపోవాలన్నా నిత్యం తమలో స్ఫూర్తి నింపేలా ఆయా రాష్ట్రాలకు ట్యాగ్‌లైన్స్ పెట్టుకుంటారని తెలిసింది. అక్కడి ప్రజలకు ఎక్కువ ఆ రాష్ట్రం పేరు కన్నా ట్యాగ్‌లైన్లే గుర్తుంటాయని చెప్పారు. దీంతో అప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ...ది ఫ్యూచర్ స్టేట్ అంటూ నామకరణం చేశారు. ఇకపై రాష్ట్రాన్ని అందరూ ఇలాగే పిలవాలని పిలుపునిచ్చారు. ఫ్యూచర్ స్టేట్‌లో పెట్టుబడులు పెడితే మీ ఫ్యూచర్‌కు ఢోకా ఉండదని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రానున్నది అంతా ఏఐ టెక్నాలజీ కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం ఆ తరహా పరిశ్రమలను హైదరాబాద్ తీసుకొచ్చేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తోంది. ఐటీ పరిశ్రమలకు హైదరాబాద్ స్వర్గధామమని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సైతం పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను అనుసరిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు హైదరాబాద్ వచ్చి అక్కడి పరిస్థితులను చూసి పెట్టుబడులు పెట్టాలని కోరారు. ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు, సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి శీధర్‌బాబు హామీ ఇచ్చారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు.

**హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ కొత్త రీసెర్చ్ సెంటర్..**

ప్రపంచంలోని అతిపెద్ద బయో టెక్నాలజీ కంపెనీల్లో ఒకటైన ప్రఖ్యాత ఆమ్‌జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్‌లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



గారి నేతృత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఉన్నతాధికారుల బృందం శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆమ్‌జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమై ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు.

**అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తో సీఎం భేటీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు. ఫ్యూచర్ స్టేట్ తెలంగాణకు పెట్టుబడులు లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రస్తుతం కాలిఫోర్నియాలోని పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. అడోబ్ సీఈవోతో సమావేశంలో సీఎం తోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలపై శంతను నారాయణ్ ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు అంగీకరించారు. టెక్ విజనరీ శంతను నారాయణ్ ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## పాల బిల్లులు చెల్లించాలంటూ
# రైతుల ఆందోళన
### జాతీయ రహదారిపై పాల డబ్బాలతో రాస్తారోకో

**జనగామ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వంపై పాడి రైతులు కన్నెర్ర చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన బాటపట్టారు. పాల బిల్లులు చెల్లించడం లేదంటూ జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై పాల డబ్బాలతో పాడి రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతుల ధర్నాతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాడి రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లుల కోసం పలుమార్లు ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసినా ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. తమ గురించి ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించుకుండా ప్రజాప్రతినిధులు తమ గొప్పలను ప్రదర్శించేందుకు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మా బతుకు దెరువు పాడి అని, పాడితోనే బతుకులీడుస్తున్నామని, పాలబిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తమను రోడ్డు పాలు చేసిందని తీవ్రంగా మండిపడ్డారు. బిల్లులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

# పెన్షన్ డబ్బుల కోసం గొడవ
### తల్లికి ఉరేసి చంపిన కిరాతక కొడుకు

**మెదక్, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** పింఛన్ డబ్బుల కోసం కన్నతల్లినే ఓ దుర్మార్గపు కొడుకు కడతేర్చాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేటకు చెందిన రామచంద్రం గత కొన్ని ఏండ్లుగా మద్యానికి బానిపై డబ్బుల కోసం ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లి దుర్గవ్వ(70)తో రామచంద్రం గొడువపడ్డాడు. మద్యం మత్తులో చున్నీతో తల్లి మెడకు ఉరివేసి హత్య చేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు కూతురు విజయ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# తీహార్ జైలులో అధ్వాన్నంగా పరిస్థితులు

**హైదరాబాద్, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** ఢిల్లీ మద్యం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందని.. అరవింద్ కేజీవ్రాల్, కవితకు కూడా వస్తుందని భావిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఛార్జ్‌షీట్ వేశాక జైల్లో ఉంచాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కవితకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. జైల్లో కవిత 11 కిలోల బరువు తగ్గారని.. బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత అరెస్టయి తీహార్ జైలులో ఉన్నారు. కవితను బయటకు తీసుకొచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎలాంటి సానుకూల ఫలితం రాలేదు. తీహార్ జైలులో ఉన్న కవితతో మరోసారి భేటీ అయ్యారు కేటీఆర్. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చేస్తూ కవితకు వచ్చేవారం బెయిల్ వచ్చే అవకాశం ఉందన్నారు. కవిత జైల్లో చాలా ఇబ్బందులు పడుతుందన్న కేటీఆర్.... ఇప్పటికి 11 కిలోల బరువు తగ్గిందన్నారు. లిక్కర్ కేసులో అరెస్టైన అయిన బీపీతో బాధపడుతుందని... రోజుకు రెండు బీపీ టాబ్లెట్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 11 వేలమంది ఖైదీల సామర్థ్యం ఉన్న జైలులో 30 వేలమంది ఖైదీలున్నారు. జైలు పరిశుభ్రంగా లేదు. జైలుకు వెళ్లి వచ్చిన వాళ్ళు భవిష్యత్‌లో పెద్ద లీడర్లు అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

# కాంట్రాక్టర్‌దే బాధ్యత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి ఉత్తమ్ సుంకిశాల పంప్ హౌజ్ ను సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన సోషల్ మీడియా ద్వారానే ప్రభుత్వానికి తెలిసింది.. వెంటనే ప్రభుత్వం స్పందించిందన్నారు. వాటర్ వర్క్స్ అధికారులు విచారణ చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత వారితో చర్చించి తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో దక్షిణ తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందన్నారు. సుంకిశాల ఘటనపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జరిగిన ఘటన చిన్నదేనని, నష్టం కూడా తక్కువేనని, దానిని కాంట్రాక్టరే భరిస్తారని ఉత్తమ్ చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని మంత్రి పేర్కొన్నారు. నిర్మాణం పూర్తి కావడానికి ఒకటి, రెండు నెలలు ఆలస్యం అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్ఎల్బీసీని తాము పూర్తి చేస్తామని చెప్పారు. డిండి ఎత్తిపోతల పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఎందుకు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సుంకిశాల ప్రాజెక్టు కూలడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతే కారణం అని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. సుంకిశాలలో నిర్మించిన ప్రాజెక్టు కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిందన్నారు. ప్రాజెక్టు కూలిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామ న్నారు.

## సుంకిశాల ప్రాజెక్టుపై
# అసత్య ప్రచారం

సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు ప్రారంభించా మని చెప్పారు. ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే భారాస ప్రభుత్వమని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజ్ ఉన్నా హైదరాబాద్‌కు నీటి కొరత రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కృష్ణా నదికి నాలుగేళ్లు నీరు రాకపోయినా సుంకిశాల ప్రాజెక్టుతో నీటి ఇబ్బందులు రావు. బెంగళూరు, దిల్లీ, చెన్నైలో నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు పోరాడుతున్నారు. హైదరాబాద్‌లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేదు. నగరంలో 50 ఏళ్ల తాగునీటి అవసరాలకు సరిపడేలా ప్రణాళికలు చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుంకిశాల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్‌కు తీరని నష్టం. సుంకిశాల ప్రమాదం జరిగినప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ ఘటన గురించి సభలో ఎందుకు ప్రకటన చేయలేదని అన్నారు. కావాలనే దీనిని దాచి పెట్టారని మండిపడ్డారు. విపత్తు జరిగిన విషయం ప్రభుత్వానికి తెలియదా? తెలిసి కూడా నొక్కి పెట్టారా? వద్దని వారించినా ఒత్తిడితో గేట్లు బిగించారని ఇంజినీర్లు చెబుతున్నారు. హడావుడి పనులతోనే సుంకిశాల ప్రమాదం జరిగింది. ఇంజినీర్ల పర్యవేక్షణ, పురపాలక శాఖ అజమాయిషీ లేకుండా పనులు చేపట్టారు. సుంకిశాల ఘటనకు ముఖ్యమంత్రిదే బాధ్యత అని ఆరోపించారు. మంచి అయితే వారి ఖాతా, చెడు అయితే మా ఖాతాలో వేస్తున్నారు. కాంగ్రెస్ నేతలకు పాలన చేతకాదు. సుంకిశాలను భారాస బృందం సందర్శిస్తుంది. విశ్రాంత ఇంజినీర్లను కూడా సుంకిశాలకు తీసుకెళ్తాం. కాంగ్రెస్ నేతల చిల్లర ప్రచారానికి ప్రకృతే సమాధానం చెబుతుందని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ నగర త్రాగునీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. నల్గొండ రైతులు సాగునీటి అవసరాలు తీరకుండా హైదరాబాద్ నగరానికి సుంకిశాల నీళ్లను ఎట్లా తీసుకువెళ్తారని ఆందోళన చేశారన్నారు. రైతులను ఒప్పించి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 90 మిలియన్ గ్యాలన్ల నీళ్లను సుంకిశాల నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్ హయాంలో 108 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం ఇచ్చారన్నారు. కేసీఆర్ వచ్చాక కాళేశ్వరం, సీతారామ లాంటి ప్రాజెక్టులు కట్టి రైతుల్లో సాగునీటికి ఢోకా లేకుండా చేశారని తెలిపారు. కేసీఆర్ సుంకిశాల విషయంలో నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా హైదరాబాద్ నగరానికి త్రాగు నీళ్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. తాము సుంకిశాలకు వెళ్లి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చడానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. సుంకిశాల నుంచి మూడు పైప్ లైన్ల ద్వారా నీళ్లను ఎత్తిపోసి హైదరాబాద్ నగరానికి నీళ్లను తీసుకువచ్చామన్నారు. ఎల్లంపల్లి నుంచి గోదావరి నీళ్లు, సుంకిశాల నుంచి క్రిష్ణా నీళ్లు, మల్లన్న సాగర్ నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి తేవడమే లక్ష్యంగా కేసీఆర్ పని చేశారని చెప్పుకొచ్చారు.

## నచ్చిన దుస్తులు
# ధరించాలి

సర్క్యులర్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ముంబయిలోని ఎన్‌జి ఆచార్య, డికె మరాఠే కాలేజీకి చెందిన ముస్లిం విద్యార్థినులు దాఖలు చేసిన పటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కళాశాల విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, సంజరుకుమార్ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కాలేజీ యాజమాన్యం వాదనలపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల పేర్లు మతాన్ని బహిర్గతం చేయడం లేదా నెంబర్స్ ద్వారా వారిని గుర్తించమని అడుగుతారా? అంటూ జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. కాలేజీ తరపు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ ఇది ప్రైవేట్ సంస్థ అని చెప్పగా.. కాలేజీ ఎప్పటి నుంచి పని చేస్తుందని జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. 2008 నుంచి కళాశాల ఉనికిలో ఉందని చెప్పగా.. ఇన్నాళ్లు మీరు ఎందుకు సూచనలు చేయలేదు? మతాన్ని అకస్మాత్తుగా గుర్తించారా? ఏళ్ల తర్వాత ఇలాంటి సూచనలు చేయడం దురదృష్టకరమని.. తిలకం ధరించిన వారిని సైతం అనుమతించబోమని చెబుతారా? అంటూ జస్టిస్ ఖన్నా న్యాయవాదిని ప్రశ్నించారు. కాగా, 441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు సంతోషంగా హాజరవుతు న్నారని.. కొందరు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు.

## తవ్వకాల్లో కుండనిండా
## బంగారు నాణేలు

మోకరిల్లిన విలుకాడు చిహ్నం ఉంది. వీటితోపాటు ఎంతో విలువైన పలు వస్తువులను కూడా గుర్తించారు. ఇవన్నీ క్రీస్తు పూర్వం ఐదో శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. ఇవన్నీ పురాతన గ్రీకు రాజ్యానికి చెందినవిగా అంచనా వేస్తున్నారు. వీటిని సర్డిస్ అనే ప్రాంతంలో తయారుచేసినట్లు భావిస్తున్నారు. ఈ నాణెళిలను కిరాయి సైనికులకు చెల్లించేందుకు వినియోగించి ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎవరూ తాము మరోసారి తీసుకునే అవసరం లేదని బంగారు నాణెళిలు పాతిపెట్టరని.. ఇవి ఎవరో దురదృష్టవంతుడైన కిరాయి సైనికుడికి చెందినవి కావొచ్చని యూనివర్శిటీ ఆఫ్ మిచిగాన్‌కు చెందిన క్రిస్టఫర్ రాటే పేర్కొన్నారు. ఒక్కో బంగారు నాణెం అతడి ఒక నెల జీతం కావచ్చని గ్రీక్ చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. అప్పట్లో వెండి నాణెళిలను రోజువారీ ఖర్చులకు వాడేవారని భావిస్తున్నారు. క్రీస్తు పూర్వం 427లో ఏథెన్స్‌కు చెందిన ఓ జనరల్ పర్షియా తరఫున దాడి చేసిన కిరాయి హంతకుల సమూహాన్ని మట్టుబెట్టారని.. అందులో వ్యక్తికి చెందినవిగా అనుమానిస్తున్నారు.

## ఆగష్టు 15లోపు
# రూ.2 లక్షల రుణమాఫీ

రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన ఒక లక్ష రూపాయల రుషమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు. లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. ఈ రాష్ట్ర బ్జడెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు... రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుందన్నారు. క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నామన్నారు. రైతులు కట్టాల్సిన రూ.1,350 కోట్లు కడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. పండే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవన పంటలు, డ్రిప్, సింప్లన్‌కు ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. రూ.1,450 కోట్లతో పూర్తి చేసే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ పేరు పెట్టి కేసీఆర్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లుకు పెంచి దోపిడీ చేసిందని ఆరోపించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ ఖండిస్తూ వస్తోందన్నారు. రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రుల సమక్షంలో రివ్యూ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో నీళ్ళు పారించే విధానంతో అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలు పండించేలా సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్‌తో పనులు చేశామన్నారు. ఎన్ఎస్‌పీ లింకు , వైరా కెనాల్‌కు లింకు కలపటమే రేపటి కార్యక్రమమని... ఇదీ మా నిబద్ధతకు తార్కాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# జయబచ్చన్ మళ్లీ ఆగ్రహం

వాడుతుంటారు. ఆయన పట్టించుకోవాలని నేను అడగడం లేదు. ఐదోసారి నేను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నాకు తెలీదా ఏం మాట్లాడాలో..? ఇలాంటి ప్రవర్తన గతంలో ఎన్నడూ చూడలేదు. దీనిపై క్షమాపణలు చెప్పాలి' అని ఆమె డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఆమె వెంట సోనియా గాంధీ కూడా ఉన్నారు.ఇటీవల రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్.. జయా అమితాబ్ బచ్చన్ మాట్లాడాలంటూ ఆహ్వానించారు. దీనిపై జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'జయా బచ్చన్ అంటే సరిపోతుంది' అంటూ పేర్కొన్నారు. 'రికార్డుల్లో మీ పూర్తి పేరు ఇలానే ఉంది' అంటూ చెప్పగా.. 'మహిళలకు స్వతహాగా గుర్తింపు లేదా' అంటూ ఆ రోజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

# వాయిదా వేయలేం

పరీక్షను వాయిదా వేసి విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టలేమని వ్యాఖ్యానించింది. దేశంలో వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఈ తీర్పుతో షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 11న ఆదివారం ఈ పరీక్ష జరగనుంది. గత ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహిస్తోంది. ఇప్పటివరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్–యూజీ 2024 పరీక్షపై దేశ వ్యాప్తంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా 185 నగరాల్లో ఆగస్టు 11న కంప్యూటర్ ఆధారిత విధానంలో రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఆధారంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

# బెయిల్‌పై రిలీజ్

జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆయన 17 నెలలుగా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన్ని పోలీసులు విడుదల చేశారు. సిసోడియా బయటకి రాగానే ఆప్ మంత్రి అతిషి, ఎంపీ సంజయ్ సింగ్ సహా కార్యకర్తలు స్వాగతం పలికారు. సత్యం గెలిచిందంటూ ఆప్ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ.. తాను బాబాసాహెబ్ అంబేద్కర్‌కి రుణపడి ఉంటానన్నారు. మహనీయుడికి తన రుణం ఎలా చెల్లించాలో అర్థం కావట్లేదని వ్యాఖ్యానించారు. జైలు నుంచి బయటకు రాగానే ఆయన నేరుగా ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ నివాసానికి బయలుదేరారు. కాగా ఇదే కేసులో కేజీవ్రాల్‌ని ఈడీ, సీబీఐ అరెస్ట్ చేశాయి. ఈడీ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు కాగా.. సీబీఐ కేసులో ఇంకా శిక్ష అనుభవి స్తున్నారు. లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన మనీశ్ సిసోడియా బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులిచ్చింది. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ఆ మొత్తానికి ఇద్దరు షూరిటీలతో ఆయనను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. బెయిల్ సందర్భంగా ఆయనకు కొన్ని షరతులు విధించింది. సిసోదియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని కోర్టు ఆదేశించింది. సిసోదియాకు బెయిల్ వచ్చిందని తెలిసిన వెంటనే ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతిషి తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. కన్నీళ్లు తెచ్చుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అవుతోంది. ఓ స్కూల్‌లో విద్యాశాఖ మంత్రి అతిషి ప్రసంగిస్తున్నారు. ఇంతలో విషయం తెలిసి బాధ పడ్డారు. మాటలు ఆపేసి.. తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. పక్కనున్న వారు మంచినీరు ఇవ్వగా కొన్ని తాగారు. తర్వాత కూడా చాలా బాధ పడుతూ మాట్లాడారు.

## ఉండి ఎమ్మెల్యే రఘురామ టార్చర్ కేసు

### సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురు

### మధ్యంతర బెయిల్ నిరాకరించిన హైకోర్టు

**అమరావతి, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజుకు కస్టోడియల్ టార్చర్ కేసులో అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. రఘురామ ఫిర్యాదుతో గుంటూరులోని నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసుపై విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. రఘురామకు కస్టోడియల్ టార్చర్‌లో గాయాలైనట్లు గతంలో సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. విజయ్‌పాల్‌కు ముందస్తు, మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వడానికి ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు పిటిషనర్ తరఫున జీవీఎస్ కిశోర్ కుమార్ వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారమే రఘురామ కృష్ణరాజును విచారించామని.. కస్టోడియల్ టార్చర్ జరగలేదన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని.. ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును కోరారు. 2021 మేలో తనపై రాజద్రోహం కేసు నమోదు చేసి సీఐడీ అధికారులు రాత్రంతా కస్టడీలో నిర్బంధించి హతమార్చేం దుకు యత్నించారని రఘురామకృష్ణరాజు ఇటీవల నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సీఎం జగన్, అప్పటి సీఐడీ విభాగాధిపతి పీవీ సునీల్‌కుమార్, అప్పటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ తదితరులపై కేసు నమోదు చేశారు.

## పంద్రాగస్ట్ వేడుకలకు ఏర్పాట్లు

### విజయవాడలో సిఎం చంద్రబాబు పతాకావిష్కరణ

### కాకినాడలో డిప్యూటి సిఎం పవన్ జెండా వందనం

### ఆయా జిల్లాల్లో పాల్గొనే మంత్రుల జాబితా విడుదల

**అమరావతి,ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఏపీ సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్టాస్థాయిలో నిర్వహించే వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు సీఎం ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని తెలిపింది. ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే మంత్రులు వివరాలను వెల్లడించింది. కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. జిల్లాల్లో పాల్గొనే మంత్రుల వివరాలను వెల్లడించింది. శ్రీకాకుళం– అచ్చెన్నాయుడు, విజయనగరం– కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం మన్యం– గుమ్మిడి సంధ్యారాణి, విశాఖపట్నం– అనగాని సత్యప్రసాద్, అనకాపల్లి– వంగలపూడి అనిత, తూర్పుగోదావరి– కందుల దుర్గేశ్, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ– వాసంశెట్టి సుభాష్, పశ్చిమగోదావరి– నిమ్మల రామానాయుడు, ఏలూరు– కొలుసు పార్థసారథి, కృష్ణా– కొల్లు రవీంద్ర, గుంటూరు– నారా లోకేశ్ పల్నాడు– నాదెండ్ల మనోహర్, బాపట్ల– గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం– డోలా బాలవీరాంజనేయస్వామి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు–పి. నారాయణ, చిత్తూరు– సత్యకుమార్, కడప– ఎన్ఎండీ ఫరూక్, అన్నమయ్య– మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తిరుపతి– ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల– బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు– టీజీ భరత్, అనంతపురం– పయ్యావుల కేశవ్, శ్రీ సత్యసాయి– సవితలు జెండా ఆవిష్కరణలో పాల్గొంటారు.

## విత్తన కొరత లేదని చెప్పగలరా?

### పల్నాడు జిల్లాలో రైతుల కష్టాలు కనిపించడం లేదా?

### మంత్రి అచ్చెన్నాయుడిపై మండిపడ్డ షర్మిల



**అమరావతి,ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** విత్తనాల కొరతపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలా తోక లేనిదని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా అని ఆమె ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు కనిపించడం లేదా అని నిలదీశారు. సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా అని షర్మిల విస్మయం వ్యక్తం చేశారు. రాత్రంతా క్యూలైన్లో రైతులను నిలబెట్టడమా మీ కూటమి ప్రభుత్వ ఏలుబడి అని ఆమె ప్రశ్నించారు. సంక్షోభం నుంచి సంక్షేమం అంటే కుండపోత వర్షంలో మహిళలను ఇబ్బందులు పాలు చేయడమే కాబోలు అని షర్మిల ఎద్దేవా చేశారు. రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక కుటుంబాన్ని గుంజు తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకనే కదా మీకు పట్టం కట్టింది, జగన్ నిండా ముంచారనే కదా 11 సీట్లకు పరిమితం చేసిందని టీడీపీ ప్రభుత్వంపై షర్మిల ప్రశ్నలు సంధించారు. మోసం చేశారనే కదా కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని వైసీపీ పాలనపై షర్మిల విమర్శలు చేశారు.

## రహస్యంగా రెండో పెళ్లికి భర్త సిద్ధం

### మొదటి భార్య రావడంతో పెళ్లిపీటల మీద నుంచి జంప్

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**తిరుమల,ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** తన భార్యకు తెలియకుండా సీక్రెట్‌గా రెండో పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడో ప్రబుద్ధుడు. హైదరాబాద్ నుంచి తిరుమలకు వచ్చి మరీ పెళ్లికి సిద్ధమయ్యాడు. కానీ సడెన్‌గా మొదటి భార్య రాకతో అతని ప్లాన్ బెడిసికొట్టింది. భర్త కుట్రను ఎలాగో తెలుసుకున్న భార్య తన కుటుంబసభ్యులతో కలిసి పెళ్లి సమయానికి కల్యాణ మండపానికి చేరుకుంది. దీంతో పెళ్లిపీటల మీద నుంచి వరుడు పలాయనం చిత్తగించాడు. తిరుమలలో కలకలం సృష్టించిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రాకేశ్‌కు వరంగల్ జిల్లా పెద్ద పెండ్యాలకు చెందిన సంధ్యతో వివాహమైంది. వారికి ఏడేళ్ల కుమార్తె కూడా ఉంది. కానీ సంధ్యకు విడాకులు ఇవ్వాలని రాకేశ్ అనుకున్నాడు. విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలోనే మొదటి భార్యకు తెలియకుండా రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుమలలోని గోగర్భం డ్యామ్ వద్ద ఉన్న ఓ మఠంలో రెండో పెళ్లి చేసుకోబోయాడు. అయితే తన భర్త రెండో వివాహం గురించి తెలుసుకున్న సంధ్య తన కుమార్తె, కుటుంబసభ్యులతో కలిసి కల్యాణ మండపానికి చేరుకుంది. కళ్యాణ మండపం వద్దకు తన మొదటి భార్య సంధ్య రావడం గమనించిన రాకేశ్, అతని కుటుంబ సభ్యులు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అక్కడ ఉన్న కొంతమందిని సంధ్య కుటుంబ సభ్యులు పట్టుకుని తిరుమల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, తనకు న్యాయస్థానం ఇంకా విడాకులు మంజూరు చేయలేదని.. తన భర్తతో ఉండేందుకు కోర్టు తమకు అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. కానీ రాజకీయ నాయకుల అండదండలతో తన భర్త తనను ఇంటి నుంచి తరిమేశారని వాపోయింది. తన భర్త రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని తెలుసుకుని తిరుమలకు వచ్చి ఆపేశానని చెప్పింది.

# వైసీపీకి మరో భారీ షాక్

### పార్టీకి పదవులకు ఆళ్లనాని రాజీనామా

### ప్రత్యక్ష రాజకీయాలకు దూరం అంటూ ప్రకటన



**ఏలూరు, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆ పార్టీకి అన్నీ ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. పార్టీని గాడిలో పెట్టడానికి నానా తిప్పలు పడుతున్న అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నేతలు దిమ్మతిరిగే షాకులిస్తున్నారు. ఒకరా ఇద్దరా పదుల సంఖ్యలో ముఖ్య నేతలు, మాజీలు రాజీనామా చేసేసి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో చేరిపోతున్నారు. ఇంకొందరు రాజీనామా చేసి కండువా కప్పుకోవడానికి మంచి రోజు కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు మాజీలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లో సీనియర్ నేత, జగన్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్న ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) రాజీనామా చేసారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి పెద్ద దిక్కుగా ఉన్న ఆళ్ల నాని పార్టీకి గుడ్ బై చెప్పేశారు. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవితో పాటు నియోజకవర్గ ఇంఛార్జ్ పదవికి కూడా ఆళ్ల రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇకపై తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపారు. అయితే.. గత కొన్ని రోజులుగా పార్టీలో జరుగుతున్న పరిణామాల పట్ల నాని అసంతృప్తిగా ఉన్నట్లు వైసీపీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై నాని గానీ.. ఆయన ప్రధాన అనుచరులు, ద్వితీయ శ్రేణి నేతలు ఎక్కడా స్పందించం లేదు. రాజీనామాను వైసీపీ హైకమాండ్ అంగీకరిస్తుందా లేకుంటే తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి వైఎస్ జగన్ బుజ్జగిస్తారా..? అనేది తెలియట్లేదు. ఆళ్ల నాని.. వైఎస్ కుటుంబానికి వీరవిధేయుడు. వైఎస్ జగన్ రెడ్డికి కూడా అత్యంత నమ్మకస్తుడు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన ఆయన విజయం సాధించారు. వైఎస్సార్ మరణాంతరం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ తరఫున తొలిసారి పోటీచేసిన నాని.. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బడేటి కోట రామారావు చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. వైఎస్ ఫ్యామిలీకి సన్నిహితుడు కావడంతో 2017లో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు జగన్. 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేసిన నాని.. 4,072 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అటు వైసీపీ కూడా 151 సీట్లతో అధికారంలోకి రావడంతో మంత్రి వర్గంలో ఆళ్లకు చోటు దక్కింది. డిప్యూటీ సీఎంతో పాటు ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి పదవి దక్కించుకున్నారు. అయితే.. 2024 ఎన్నికల్లో నాని ఘోర పరాజయం పాలయ్యారు. మొదట్లో కాస్తో కూస్తో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. గత కొన్ని రోజులుగా పూర్తిగా దూరమయ్యారు. ఇప్పుడు ఏకంగా వైసీపీకే రాజీనామా చేసేశారు. నాని తదుపరి కార్యాచరణ ఏంటి అనేదానిపై క్లారిటీ లేదు.

# రవాణాశాఖలో ప్రక్షాళన

### పోర్టుకు బియ్యం తరలుతున్నా పట్టింపేది?

### త్వరలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం

### మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి



**విజయవాడ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** రవాణా శాఖలో ప్రక్షాళనకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రవాణా శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం నాడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రి చర్చించారు. రవాణా శాఖలో కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా శాఖలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సీరియస్ అయ్యారు. గత ఐదేళ్లలో చౌకబియ్యం కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలి వెళ్లాయని ఆరోపించారు. అక్రమంగా వెళ్తున్న వాహనాలను పట్టుకోకపోవడమేంటని ఆర్టీఏ అధికారులను ప్రశ్నించారు. గతంలో రాష్ట్రంలో అక్రమంగా ఇసుక, ఖనిజాలు తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమంగా ఇసుక, మైన్స్ తరలింపు వాహనాలపై చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో ఒకే నెంబర్‌తో పలు వాహనాలు తిరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. నిరంతరం తనిఖీలు చేసి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఏ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో రవాణా శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం సమూల ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. రవాణాశాఖలో అవినీతి, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్రమార్కుల పనిపట్టి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైసీపీ పాలనలో ఆర్టీసీలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల వల్ల 2019–24 మధ్య ఆర్టీసీ నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం చెల్లించని బకాయిలు, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అమరావతి బ్రాండ్ ఏసీ బస్సులను పూర్వవైభవం తీసుకువస్తామని ఉద్ఘాటించారు. ఒవర్ లోడ్ , ఫిట్ నెస్ లేకుండా, తిరుగుతున్న వాహనాలపై తనిఖీలు చేసి జప్తు చేయాలని అధికారులకు ఆదేశాలు విడుదల చేశారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్లు, సిబ్బంది కొరత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు , బస్టాండ్లలో పరిశు భ్రతను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాల్లో జాప్యాన్ని నివారించి వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు. కారుణ్య నియామకాలపై చర్చించామన్న ఆయన.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎంతో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో రేషన్, మైన్స్ అక్రమ రవాణాను నివారిస్తామన్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్తవి తీసుకొస్తామని చెప్పారు. ఆర్టీసీలో 7 వేల మంది సిబ్బంది కొరత ఉందని.. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని తెలిపారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఈనెల 12న మరోసారి సీఎం సమీక్షిస్తారన్న ఆయన.. మహిళలకు ఉచిత ప్రయాణం అమలుపై సీఎం చర్చిస్తారని చెప్పారు.

### అంబేడ్కర్ విగ్రహం వద్ద

## వైసిపి నిరసన

### నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన

### జగన్ పేరున్న శిలాఫలకం దొంగతనంపై ఆగ్రహం

**విజయవాడ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** విజయవాడ అంబేద్కర్ విగ్రహం దగ్గర నల్ల బ్యాడ్జీలు ధరించి వైసిపి నేతలు శుక్రవారం నిరసన చేపట్టారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ నిరసన తెలిపారు. కాంస్య విగ్రహం ఆవిష్కరణ శిలాఫలకంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించటంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రంలో రక్షణ లేదని ఆరోపించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇక్కడ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పాలకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని భక్షించాలనే ఉద్దేశంతో ఉన్నట్టు రాత్రి ఘటన స్పష్టంగా కనిపిస్తుంది.. ఇప్పటికే గ్రామ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన చేయాలని వైసిపి తరపున పిలుపు ఇచ్చామన్నారు. ఈ విషయంపై లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని మాజీ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు. విజయవాడ నడిబొడ్డున నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్మృతి వనంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేశారు. గురువారం రాత్రి అంబేద్కర్ మహాశిల్పం చుట్టుపక్కల విద్యుత్ సరఫరా నిలిపివేయించి, సిబ్బందిని బయటకు తరలించి ఈ దాడులు చేశారని సమాచారం. తెలుగుదేశం మూకలు కుట్రపూరితంగా ఈ దాడికి పాల్పడ్డారని వైసిపి శ్రేణులు ఆరోపిస్తున్నారు.

## విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని దాడులు

### అశాంతి సృష్టికి వైసిపి కుట్రలు: టిడిపి

**విశాఖపట్నం, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై అగంతకుల ముసుగులో వైసీపీ దాడి చేసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు ఆరోపించారు. మహనీయుల విగ్రహాలపై దాడులు చేసి రాష్ట్రంలో అశాంతిని సృష్టించాలని వైసీపీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దళిత, గిరిజనులపై దాడులు జరిగినప్పుడు వైసీపీ ప్రజా ప్రతినిధులు ఎందుకు ధర్నాలకు దిగలేదు? అని ప్రశ్నించారు. విదేశీ విద్యోన్నతి పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్ రెడ్డి పేరుని పెట్టినప్పుడు వైసీపీ దళిత నేతలు ఏం చేశారని ప్రశ్నించారు. హత్యా రాజకీయాలకు వైసీపీ పెట్టింది పేరని విమర్శించారు. వైసీపీ నాయకులు అసంబద్ధంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లపై అవాకులు చెవాకులు పేలితే తాటతీస్తామని ఆరేటి మహేష్ బాబు హెచ్చరించారు.

## గిరిజనులను ముందుకు నడిపించాలి

### గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

### ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్ట్9 (క్విక్ టుడే న్యూస్) :** గిరిజనులు ఇంకా వెనుకబడి ఉన్నారని,వారిని ఆదుకుని ముందుకు నడిపించాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలన అంతానికి పోరాడి ప్రాణ త్యాగం చేశారు. స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాగలిగారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆఫ్రికా తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో గిరిజనులు ఉండే దేశం భారత్. అన్ని రంగాల్లో గిరిజనులు ముందుండాలనేదే నా ఆకాంక్ష. మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలి. ప్రధాని వచ్చినప్పుడు అరకు కాఫీ రుచి చూపించాం.తెదేపా ప్రభుత్వ హయాంలో ఏటా ఆదివాసీ దినోత్సవం నిర్వహించాం. గత ఐదేళ్లలో ఈ దినోత్సవాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆదివాసీలంటే శౌర్యం, సహజ ప్రతిభ, నైపుణ్యం కలిగిన వ్యక్తులు. దేశవ్యాప్తంగా 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 27.39 లక్షల మంది ఉన్నారు' అని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

# నేను ఒంటరినని చెప్పలేదే: కీర్తిసురేశ్

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని నటి కీర్తి సురేశ్ తెలిపారు. తాను నటించిన చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద పరాజయం పొందాయని.. దాంతో చాలామంది తనని విపరీతంగా విమర్శించారని ఆమె చెప్పారు. వారి మాటల వల్ల కొన్ని సందర్భాల్లో తాను ఎంతో బాధపడ్డానని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. అంతేకాకుండా తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మాట్లాడుతూ తాను సింగిల్ కాదని తెలిపారు. వర్క్‌లైఫ్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. మనసుకు నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నా. కెరీర్ ఆరంభంలో నేను యాక్ట్ చేసిన చాలా చిత్రాలు లాప్ అయ్యాయి. దాంతో నేను ఎన్నో ట్రోల్స్ ఎదుర్కొన్నా. నాకు తెలిసి అత్యధిక ట్రోల్స్ ఎదుర్కొన్న దక్షిణాది నటిని నేనే. 'మహానటి' తర్వాత నాపై ట్రోల్స్ తగ్గాయి. విమర్శలను నేనూ స్వాగతిస్తా. వివరణాత్మక విమర్శల నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటా. కానీ, కొంతమంది కావాలని నెగెటివ్ కామెంట్స్ చేస్తుంటారు. వాటిని పెద్దగా పట్టించుకోను. ఎక్కడా రియాక్ట్ కాను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని భావిస్తున్నా అని కీర్తి సురేశ్ తెలిపారు. పెళ్లి గురించి మాట్లాడుతూ.. ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాన్ని కొనసాగించడమే పెళ్లి అని నా భావన అని అన్నారు. దీంతో విలేకరి సింగిల్‌గా ఉంటున్నారు. బోర్‌గా అనిపించడం లేదా? అని ప్రశ్నించగా.. సింగిల్ అని నేను చెప్పలేదుగా అని నవ్వుతూ బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. కీర్తిసురేశ్ రిలేషన్‌లో ఉన్నారని పలువురు నెటిజన్లు భావిస్తున్నారు. అదే విషయాన్ని ఆమె పరోక్షంగా చెప్పిందనుకుంటున్నారు. కీర్తిసురేశ్ నటించిన తాజా చిత్రం 'రఘు తాత'. సుమన్‌కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది. మరోవైపు, ఆమె 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుణ్ ధావన్ హీరోగా ఈ సినిమా సిద్ధమవుతోంది.





## మొహమంతా రక్తంతో
# నటి అనసూయ

టాలీవుడ్ అనసూయ యాంకర్‌గా కెరీర్ మొదలెట్టి ఏకంగా స్టార్ నటిగా ఎదిగింది. పుష్ప, రంగస్థలం లాంటి సినిమాలతో ఎక్కడా లేని క్రేజ్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం పుష్ప-2లోనూ నటిస్తోన్న అనసూయ.. తాజాగా మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం సింబా. ఈ మూవీ ఇవాళ థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన స్టిల్స్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన సింబాలో అనసూయ ప్రధాన పాత్రలో నటించింది. ఈ మూవీలో తన పాత్రకు సంబంధించిన ఫోటోలను తాజాగా ఇన్‌స్టాలో షేర్ చేసింది. మొహమంతా రక్తంతో తడిసి ఉన్న ఫోటోలు చూసి ఆడియన్స్ షాక్‌కు గురి అవుతున్నారు. అయితే ఈ పిక్స్ కేవలం సింబా చిత్రంలో స్టిల్స్ మాత్రమేనని.. సింబా ది ఫారెస్ట్ మ్యాన్ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. పర్యావరణాన్ని మనం ఎలా కలుషితం చేస్తున్నామో... దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనే కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించారు. ఇవాళ థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది.



## గ్రామీణ నేపథ్యంలో
# సాగిన కమిటీ కుర్రోళ్లు

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా... పవన్‌కల్యాణ్‌కు అభిమాని అయిన యదు వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. 11 మంది కొత్త హీరోలు, నలుగురు హీరోయిన్లతో ఈ చిత్రం తెరకెక్కింది. సాయికుమార్, గోపరాజు రమణ, సీనియర్ నటి శ్రీ లక్ష్మి, 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ కిశోర్ కీలక పాత్రధారులు. ఇప్పటి వరకూ ఓటీటీ సిరీస్‌లకు నిర్మాతగా వ్యవహరించిన నిహారికకు నిర్మాతగా తొలి సినిమా ఇది. గ్రామీణ నేపథ్యం అంటూ ట్రైలర్లు, పోస్టర్‌లను ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఫోన్‌లు సోషల్ మీడియా లేని సమయంలో పిల్లల జీవితం ఎలా ఉండేదో చక్కగా ఆవిష్కరించారు. సరదాగా సాగుతున్న స్నేహితుల మధ్య కులం కారణంగా చిన్నపాటి ఘర్షణ, అప్పటిదాకా కులమతాలకు అతీతంగా మెలిగిన స్నేహితులు, ఒక్కసారిగా దూరం కావడం, సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే బుజ్జి ఆ గొడవను రాజకీయ స్వార్థానికి ఎలా వాడుకున్నాడు? జాతరలో విషాదం ఇవన్నీ కూడా ఉత్కంఠగా సాగుతాయి. 11 మంది మిత్రుల్లో చిన్నవాడైన నరసింహ అలియాస్ ఆత్రం మరణం గుండెల్ని కదిలిస్తుంది. కుర్రోళ్లు అంతా కమిటీగా ఏర్పడటం, జాతర ఘనంగా జరిపించడం వంటి సన్నివేశాలు బాగానే ఉంటాయి. తదుపరి సర్పంచ్ ఎన్నికల సన్నివేశాలు గత ఎన్నికలను తలపిస్తాయి. ఇందులో నటులు 11 మంది బాగా నటించారు. శివ, సుబ్బు, విలియం, బ్రిటీష్, కిశోర్, సూర్య ఇలా ప్రతి ఒక్కరూ తమ బెస్ట్ ఇచ్చారు. యూట్యూబ్ సిరీస్‌లతో ఫేమస్ అయిన ప్రసాద్ బెహరా పెద్దోడు పాత్రతో మెప్పించారు. వింటేజ్ లుక్ లో చాలా గ్రాండ్ గా తెరకెక్కించారు.

## ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్
# కాంబినేషన్‌లో 'ఎన్టీఆర్31'

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో 'ఎన్టీఆర్31' శుక్రవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇరు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సక్సెస్ రేస్‌లో ఉన్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో సినిమాను ప్రకటించి చాలాకాలమైంది. తారక్ ఆర్ఆర్ఆర్, తదుపరి దేవర చిత్రాలతో బిజీగా ఉండటం, నీల్ సలార్ షూటింగ్‌తో బిజీగా ఉండటంతో సినిమా ప్రారంభం డిలే అయింది. వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా కోసం అభిమానులు ఎంతో ఆతురతగా ఎదురు చూస్తున్నారు. 2026 జనవరి 9 ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చిత్ర బృందం తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని అందరూ ఓ యాక్షన్ సినిమాలా భావిస్తారని నేను ముందే ఊహించాను. కానీ నేను నా జానర్‌లోకి వెళ్లాలనుకోవట్లేదు. నిజానికిది భిన్నమైన భావోద్వేగాలతో వైవిధ్యభరితంగా ఉండే చిత్రంగా ఉంటుంది. నాకిది చాలా కొత్త కథ' అని అన్నారు. 'ఎన్టీఆర్31' వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు ఖరారు చేసినట్లు వార్తలు వినిపించాయి. అయితే టైటిల్ ఏంటనేది ఇంకా వెల్లడించలేదు. ఈ చిత్రాన్ని కూడా ప్రశాంత రెండు భాగాలుగా తెరకెక్కిస్తారని టాక్ నడుస్తోంది.




**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com